రసాయనం.. అనర్థం

పంటల సాగులో రైతులు రసాయన ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. చీడపీడల నివారణకు ఎక్కువ మోతాదులో పురుగుల మందులను వాడుతున్నారు. దీంతో భూసారం క్షీణిస్తోందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దిగుబడి సైతం తగ్గిపోయే అవకాశముందని వెల్లడిస్తున్నారు. పిచికారీ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యసమస్యలు సైతం తలెత్తే ప్రమాదముందని తెలియజేస్తున్నారు.ఈ క్రమంలోనే సేంద్రియ విధానంలో సేద్యం చేయడం శ్రేయస్కరమని సూచిస్తున్నారు. ఆ దిశగా అన్నదాతలకు అవగాహన సైతం కల్పిస్తున్నారు.


పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

- పెరిగిన పురుగుమందుల వాడకం
- తగ్గుతున్న భూసారం
- సేంద్రియ ఎరువులే శ్రేయస్కరం
- అవగాహన కల్పిస్తున్న అధికార యంత్రాంగం

నగరి : నియోజకవర్గంలో 420 హెక్టార్లలో వరి, 900 హెక్టార్లలో చెరకు, 130 హెక్టార్లలో వేరుశెనగ, 120 హెక్టార్లలో వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. వీటిలో 80 శాతం రసాయన మందులతో సాగవుతుంటే, 20 శాతం మాత్రమే సేంద్రియ ఎరువులతో సాగవుతోంది. పంటల్లో చీడపీడల నివారణ కోసం పురుగు మందులు వాడడం సర్వసాధారణం. అయితే ఇష్టానుసారం పంటలకు మందులు పిచికారీ చేస్తే మంచి జరగడం అటుంచితే దుష్ప్రభావాలే ఎక్కువగా ఉంటాయి. కొందరు రైతులు మందుల దుకాణంలో ఏది పడితే అది కొనుగోలు చేసి వాడుతుంటారు. ఇలా చేయడం వల్ల భూమి సారం కోల్పోవడమే కాకుండా పంట నష్టపోయే ప్రమాదం ఉంది. సాగు వ్యయం కూడా పెరుగుతుంది.

తగు మోతాదులోనే వాడాలి

వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. అవగాహన లేకుండా వీటిని వినియోగిస్తే భూమి నిస్సారంగా మారుతుంది. కొందరు అవగాహన రాహిత్యంతో జాగ్రత్తలు తీసుకోకుండా మందులు పిచికారీ చేస్తుంటారు. ఇలా చేయడం వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తగిన మోతాదులో ఎరువులను వినియోగించడం ఉత్తమం. వీటి వాడకం తగ్గించడానికి వ్యవసాయాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతూ రైతులను సేంద్రియ ఎరువుల దిశగా నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరోగ్యకరమైన సాగు విధానాలను రైతులకు అలవాటు చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గిస్తే మేలని లేదంటే భవిష్యత్‌లో పరిస్థితి విచారకరంగా మారుతుందని పర్యావరణవేత్తలు సైతం హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్క్ వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిని చేతులతో రుద్దుకోకూడదు.
- వాడేసిన పురుగు మందు డబ్బాలను ఎక్కడపడితే అక్కడ వేయకూడదు.
- రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ లేకుండా చూసుకోవాలి.
- మందు డబ్బాపై సూచించిన మేరకు లేదా, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు మిశ్రమం కలిపి పిచికారీ చేయాలి.
- పిచికారీ చేసే సమయంలో పొగ తాగకూడదు.
- పిచికారీ చేసిన తర్వాత భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

అధిక దిగుబడుల కోసమే..



వరి సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గడం లేదు. ఎక్కువగా వాడితే అధిక దిగుబడులు వస్తాయనే అపోహతో అన్నదాతలు రసాయనిక ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా భూసారం తగ్గిపోతోంది. అందుకే వ్యవసాయ శాస్త్రవేత్తలు, సేంద్రియ ఎరువుల వాడకం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. రసాయన ఎరువుల కారణంగా చేను గట్లపై పెరిగే గడ్డి విషపూరితంగా మారుతోంది. ఈ గడ్డి తిన్న పశువుల ఆరోగ్యం సైతం దెబ్బతింటోంది. రైతులు ప్రకృతి సేద్యం దిశగా మొగ్గుచూపితే అందరికీ మేలు జరుగుతుంది.

– చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం

తాజా కూరగాయలు వాడాలి


కూరగాయలను పరిశీలిస్తున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి తాజా కూరగాయలు వాడాలని ఎంఈఓ గిరిజ తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆమె వెంట హెచ్‌ఎం చక్రధరరావ్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న పూర్వవిద్యార్థులు

గంగాధరనెల్లూరు: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు 1981–82 విద్యాసంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ప్రస్తుత ఇంటర్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని పూర్వవిద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మధుసూదన్, వాసు, రోశయ్య, జయచంద్రనాయుడు తెలిపారు.

క్లుప్తంగా

ర్యాలీని జయప్రదం చేయండి

గంగాధరనెల్లూరు: కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించేందుకు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని జయప్రదం చేయాలని గంగాధర్ నెల్లూరు మండల మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈవీ హరికృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 26వ తేదీ జిల్లా కేంద్రంలోని అమర జవాన్ స్థూపం వద్ద 10 గంటలకు కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించి కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. మాజీ సైనికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యథేచ్ఛగా విధులకు గైర్హాజరు


ఇల్లత్తూరు సచివాలయంలో విధులకు హాజరైంది కేవలం ముగ్గురే..!

విజయపురం : ప్రజలకు మెరుగైన సేవ అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కానీ, ప్రస్తుతం కూటమి సర్కారులో సచివాలయానికి వెళ్లి చూస్తే సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఎప్పుడు వెళ్లినా సిబ్బంది ఏదో ఒక పనిమీద మండ ల కార్యాలయానికి వెళ్లారు అనే సమాధానమే వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల స్థాయి అధికారులను ప్రశ్నించగా ఈ రోజు ఎలాంటి మీటింగ్ లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

108లో ప్రసవం


108 వాహనంలో ప్రసవించిన హరిత

గంగాధర నెల్లూరు: మండలంలోని మహదేవ మంగళం గ్రామానికి చెందిన నిండు గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. మహదేవ మంగళం గ్రామానికి చెందిన హరిత గర్భిణి. ఈమెకు బుధవారం ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబీకులు108కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది 108లో హరితను ఎక్కించుకుని ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. ఈలోపే నొప్పుడు ఎక్కువవడంతో వాహనంలోనే ప్రసవించింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. 108 సిబ్బంది ఈఎంటీ ప్రశాంత్ , పీఎం మురుగయ్య తల్లి బిడ్డను క్షేమంగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాలువలో కదలని మురుగు!


కాలువపై పెరిగిన పిచ్చి మొక్కలు

విజయపురం : మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడలో నిర్మించిన డ్రైనేజీలో మురుగు నిల్వ చేరుతోంది. కాలువపై పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఇళ్ల నుంచి వస్తున్న మురుగు కదలడం లేదు. దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టరేట్ మెయిన్ గేట్ మూసివేత

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద దారి లేక ప్రజలు, సిబ్బంది లోనికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులు జరుగుతుండడంతో రెండు నెలలుగా మెయిన్ గేట్‌కు దారి లేకుండా పోయింది. ఆ పైప్‌లైన్ పనులు పది రోజుల క్రితం పూర్తయ్యాయి. అయితే పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ కలెక్టరేట్ మెయిన్ గేటు నుంచి లోనికి వెళ్లడానికి రోడ్డు చదును చేయడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి అధికారులను కలిసేందుకు వచ్చే ప్రజలు లోనికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే స్పందించి కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట రోడ్డును చదును చేయించాలని ప్రజలు, కలెక్టరేట్ సిబ్బంది కోరుతున్నారు.

కార్యాలయం మార్పు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ఆహార తనిఖీ కార్యాలయాన్ని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వెనుక వైపు ఉన్న డీఎల్‌డీఓ కార్యాలయ భవనం మొదటి అంతస్తుకు మార్చినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇంతకుమునుపు రామ్‌నగర్‌కాలనీలోని అద్దె భవనంలో కార్యాలయం ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వ భవనాన్ని కేటాయించడంతో మార్చారు. దీనిని లైసెన్సుదారులు, వినియోగదారులు దీనిని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


పాతగుంటలో సభ్యత్వ నమోదు చేస్తున్న నేతలు

వెదురుకుప్పం: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పాతగుంటలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో పాఠశాలలు నిర్వహించాలన్నారు. 12వ పీఆర్సీకి సంబంధించి మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర నేత హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల తల్లులకు మాత్రమే వర్తింప చేయాలన్నారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను ప్రకటించి, యాంటిసిడెంట్ వెరిఫికేషన్లు త్వరగా పూర్తి చేసి రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి న్యామ్‌తుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు


డంప్ యార్డ్ వద్ద సూచనలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు: పురపాలక పరిధిలో జాప్యం లేకుండా పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు కాలనీల్లో సాగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. స్థానిక డంప్ యార్డ్ వ్యర్థాలతో నిండిపోవడంతో జేసీబీతో చదును చేయించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాదారులు చెత్తను తమ వద్దే ఉంచుకొని పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించాలని సూచించారు. రోడ్లపై, కాల్వల్లో చెత్తను పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇంద్ర పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

– ప్రయాణికుల అవస్థలు


మహదేవపురం వద్ద ఆగిపోయిన బస్సు

పాలసముద్రం: చిత్తూరు నుంచి బలిజకండ్రిగకు వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు మొరాయించింది. దీంతో విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు అవస్థలు పడ్డారు. బుధవారం ఉదయం చిత్తూరు నుంచి 5.30 గంటలకు బలిజకండ్రిగకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. మహదేవపురం వద్ద వెళుతుండగా 6.30 గంటలకు ఆయిల్ పైప్ కట్ అయి ఆగిపోయింది. దీంతో బస్సులో ప్రయాణికులు, విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ప్రయాణికులు ఆటోల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చరణ్‌తేజకు డాక్టరేట్



పుత్తూరు: పట్టణానికి చెందిన పి.చరణ్‌తేజ మైక్రోబయాలజీ విభాగంలో చేపట్టిన పరిశోధనకు తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ప్రొఫెసర్ చింతల పరమగీతం పర్యవేక్షణలో 'మాలిక్యులర్ అనలైసిస్ ఆఫ్ బాక్టీరియల్ డైవర్సిటీ అసోసియేటెడ్ విత్ మస్కోవైట్– ఎ కామన్ రాక్ ఫార్మింగ్ ఫిల్లోసిలికేట్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న మంగమ్మ కుమారుడు చరణ్‌తేజ ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు.

27న విభిన్న ప్రతిభావంతుల శిబిరం

పుత్తూరు: తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ బిల్డింగ్‌లో ఈ నెల 27వ తేదీన విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాలు అమర్చుకునేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చెన్నైకి చెందిన ఫ్రీడమ్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో పుత్తూరు పట్టణ పరిధిలోని అర్హులైన విభిన్న ప్రతిభావంతులు పాల్గొనవచ్చని సూచించారు. శిబిరంలో కృత్రిమ కాలు కొలతలను తీసుకొని, 20 రోజుల అనంతరం రూ.51 వేల విలువ చేసే వెయిట్ లెస్ కృత్రిమ కాలును ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికెట్, వైకల్యం కనిపించేలా రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకు రావాలని కోరారు.

ఉపాధ్యాయురాలు మృతి


శిరీష (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(సోషియల్)గా పనిచేస్తున్న శిరీష మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధ్యాయురాలు మృతి వార్త తెలుసుకున్న సహోపాధ్యాయులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పుత్తూరు : మితాహారం, క్రమం తప్పని వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని టాటా ఆస్పత్రి డాక్టర్ వెంకయ్యబాబు సూచించారు. బుధవారం పుత్తూరు మండలం రామసముద్రం గ్రామంలో రాస్ సేవా సంస్థ, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి మహిళలు తమ దైనందిన జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. అందుకే ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలన్నారు. గత రెండేళ్లుగా రాస్ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం 160 మందికి బీపీ, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు అమరావతి, రెడ్డికుమారి, మహేంద్రలు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో రాస్ ప్రాజెక్టు అధికారులు రవి, ప్రకాష్, జయలక్ష్మి, బాలమ్మ, టాటా ఆస్పత్రి మేనేజర్ హేమంత్, మెహతాజ్, రెడ్డికుమారి, మహేంద్ర పాల్గొన్నారు.

విద్యా వికాసం.. పిల్లలకు అవసరం



విద్యార్థులు ప్రదర్శించిన లోగో

వెదురుకుప్పం: ఎల్లలకు విద్యా వికాసం పెంపొందించుకోవడం అవసరమని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. శిక్ష సప్తాహ్ విద్యా వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (నెప్) లోగోను విద్యార్థుల చేత ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ వారోత్సవాల ద్వారా పిల్లల్లో నూతన ఉత్సాహాన్ని కల్పి స్తున్నామన్నారు. విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

దివ్యాంగుల భవితకు భరోసా

- విభిన్నప్రతిభావంతులకు అండగా నింద్ర భవిత కేంద్రం
- ఫిజియోథెరపీతోపాటు ఉచిత విద్య


భవిత కేంద్రంలో యోగా అభ్యసిస్తున్న విద్యార్థులు

నింద్ర : దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాలు వరంగా మారాయి. వారి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్నాయి. విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నాయి. అభాగ్యుల ఉన్నతికి తోడ్పాటునందిస్తున్నాయి. ఈ క్రమంలోనే నింద్రలోని భవిత కేంద్రం సుమారు 120 మంది విభిన్నప్రతిభావంతులకు అండగా నిలుస్తోంది. వీరికి విద్యాబోధనతోపాటు ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తోంది. దివ్యాంగ పిల్లలు ఎలాంటి ఆత్మనూన్యతకు గురికాకుండా చదువుతోపాటు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపేలా చర్యలు తీసుకుంటోంది.

పకడ్బందీగా ఫిజియోథెరపీ

నింద్రలోని భవిత కేంద్రంలో వారంలో ఒక రోజు దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఫిజియోథెరిఫీ ఇస్తున్నట్లు సహిత ఉపాధ్యాయుడు వెంకటేష్ వెల్లడించారు. దీంతో వారి ఆరోగ్యం కొంతవరకు మెరుగుపడే అవకాశముందని వివరిస్తున్నారు. భవిత కేంద్రంలో పిల్లలకు నడవడం, చదవడం, వారి పనులు వారే చేసుకునేలా తీర్చిదిద్దుతున్నామని తెలియజేస్తున్నారు. తల్లిదండ్రులు సైతం భవిత కేంద్రానికి వచ్చి తమ పిల్లలకు సేవలందించే వెసులుబాటు సైతం కల్పించామని చెబుతున్నారు. ప్రతి శనివారం గ్రామంలోని దివ్యాంగ విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నామని వెల్లడిస్తున్నారు. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్, దుస్తులు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని వివరిస్తున్నారు.

ఉపయోగకరంగా ఉంది



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంది. దివ్యాంగ విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తోంది. వారికి చదువుతోపాటు వైద్యసేవలు సైతం అందిస్తున్నారు. ఇక్కడ చేర్పించిన తర్వాత మా బిడ్డ ఆరోగ్యం కాస్త మెరుగుపడింది.

– గీత, విద్యార్థిని తల్లి

ఆరోగ్యం మెరుగుపడింది



భవిత కేంద్రంలో సేవల ద్వారా మా బాబుకు ఆరోగ్యం ఎంతో మెరుగుపడింది. అంతే కాకుండా చదవడం, రాయడంతో పాటు తన పనులు తానే చేసుకునే పరిస్థితి వచ్చింది. ఇక్కడి ఉపాధ్యాయులు ఎంతో సహనంతో పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు.

– మోహన, విద్యార్థి తల్లి

అవగాహన కల్పిస్తున్నాం



నింద్రలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో అందించే విద్య, వైద్య సేవలపై దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల్లో మనోధైర్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు సైతం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు.

– శ్రీధర్‌రాజు, ఎంఈఓ, నింద్ర

వ్యాక్సిన్‌తో రక్షణ

ముద్దచర్మ వ్యాధి నివారణకు గోట్‌పాక్స్ టీకాలు


ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువు

కార్వేటినగరం: పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధి(లంపీ) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడుతాయి. ఈ వ్యాధి వల్ల పశువులు చాలా ఇబ్బంది పడతాయి.వ్యాధి నివారణకు ఈనెల 20 నుంచి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గోట్‌పాక్స్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించనుంది. ప్రతి పాడిరైతు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్వేటినగరం మండల పశువైద్యాధికారి హేమ కుమార్ తెలిపారు.

వ్యాధి లక్షణాలు..

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడుతాయి.
- పశువులకు అధిక జ్వరం వస్తుంది.
- పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- పశువులు ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువ ఆహారం తీసుకుంటాయి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయి.

వ్యాధి వ్యాప్తి..

- ముద్ద చర్మవ్యాధి వైరస్ పశువుల నుంచి పశువులకు దోమలు, ఇతర కీటకాలు ద్వారా వ్యాపిస్తుంది.

నివారణ చికిత్స..

- వ్యాక్సిన్‌తో ముద్దచర్మ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పశువుల ఉండే ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.
- వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించాలి.
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి.
- ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ చర్యలు..

దేశంలో ప్రభుత్వం గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ అందిస్తోంది. ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సొసైటీల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తోంది.అలాగే రైతులకు పశువుల యజమానులకు ఈ వ్యాధి నివారణ చికిత్సపై అవగాహన కల్పిస్తోంది. ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ముద్ద చర్మవ్యాధి ప్రమాదకరం..



ముద్ద చర్మవ్యాధి పశువులకు ప్రమాదకరం. జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. పాడి రైతులు పశువైద్యాధికారుల సలహాలుపాటించి పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఈనెల 20 తేదీ నుంచి పశువుల కోసం ముద్ద చర్మవ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి.

– హేమకుమార్, మండల పశువైద్యాధికారి, కార్వేటినగరం మండలం